# గోరంత దీపం

'చాలా బాగుంది' మరోసారి అనుకున్నాడు గంగ రాజు. తనముందునుంచి వెళుతున్న వ్యక్తిని తేరిపారచూడ సాగేడు. అతను గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళి పోయేడు.

గంగరాజు తన చొక్కావైపు పరీక్షగా చూసు కున్నాడు. అది బాగా మాసిపోయి ఉంది. 'ఇవాల్టితో దీనికి విముక్తి'—నిశ్చయించుకున్నాడు. అప్రయత్నంగా అతని చేతులు నిక్కరు జేబుల్ని తడిమినాయి.

తృప్తిగా ఊపిరిపీల్చి కదిలేడు.

పొద్దు వాటారుతూంది. మేలిమిబంగారం కరిగి ఎత్తైన కొండలమీదనుంచి జాలువారుతున్నట్టుంది, పడమటిదిక్కు.

బ్రిడ్జి దిగి మలుపు తిరిగేడు గంగరాజు. పరిసరాల్ని పరికించేడు. మార్కెట్ ప్రదేశమంతా మూర్ఛపోయి ఉంది. 'రోజూ ఈ సమయంలో తిరుణాలలా ఉండేది. ఇవాళేం వొచ్చిందో.' పైకే అన్నాడు. కాలవగట్టున కుండల

దుకాణాల్లోమాత్రం కొంచెం సంచలనం కనిపిస్తూంది. మార్కెట్ కి ఆదుకాణాలు ఓఫర్లాంగు దూరంలో ఉన్నాయి. వాటికి ముందుగాఉంది చేపలబజారు.

'ఇక్కడేం లాభంలేదు' అనుకుంటూ నడక సాగించేడు. అడ్డరోడ్డులోనుంచి అవతలి బజారుకు చేరేడు. ఆరిపోబోతున్న బీడీని చివరిసారిగా పీల్చి దాన్ని అవతలికి విసిరేసేడు. ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని చుట్టూ చూసేడు. ఎదురుగా, సినిమాహాలు సందుమొదట్లో ఒక యువకుడు నిలబడిఉన్నాడు. గంగరాజు దృష్టి అతను తొడుక్కున్న టెరిలిన్ షర్ట్ మీద నిలిచింది. 'లేతనీలం రంగు—చాలా బాగుంది.' గంగరాజు మనస్సు సంబరపడుతూంది. మరుక్షణంలోనే ఆయువకుడు వెళ్ళిపోయాడు, తన దగ్గరగా వచ్చిన మరోవ్యక్తితో కలిసి.

తనను తట్టుకుంటూ వెడుతున్న వ్యక్తిని ఆశ్చర్యంగా చూసేడు గంగరాజు. బాగా వయసు మీరిన వాడే. అయితేనేం—చక్కగా టెరిలిన్ షర్టే తొడిగేడు. 'ఈ రంగు ఇంకా బాగుంది—ఎర్రగడి. ఇవాళెట్లాగైనా సరే సాధించి తీరాలి.' గంగరాజు దృఢంగా తీర్మానించుకున్నాడు.

రెండడుగులు వేసి రోడ్డుదాటేడు. సినిమా హాలు సందు మొదట్లోకి వచ్చి నిలబడ్డాడు. వీధి దీపాలు వెలిగినాయి. గంగరాజు చూపులు దేనికోసమో వెదకసాగినాయి.

దీపస్తంభంక్రిందుగా మిఠాయిబండిని ఆపుకుని, జనం రాకకి వేచి చూస్తున్న శేర్ జీ, చిప్స్ పళ్లెం సరిచేస్తున్నాడు.

అతని పక్కగా ముంత మసాలా అమ్ముకొనే వ్యక్తి — "మసాలా — గరం గరం మసాలా" అని ఉండి ఉండి కేక వేస్తున్నాడు.

సరిగ్గా, వీళ్ళిద్దరికీ ఎదురుగా చంద్రం గొంతుక్కూర్చుని ఉన్నాడు. చంద్రం గంగరాజుకు తెలుసు. నిక్కరు జేబులో నుంచీ తన ఆయుధాన్ని తీసేడు చంద్రం. అది నల్లటి బొగ్గు కణిక! సిమెంటు రోడ్డుమీద దుమ్మును కొంత మేర చేత్తో దులిపి, తన కార్యక్రమాన్ని మొదలెట్టాడతను. క్షణాల్లో ప్రత్యక్షమైనాడు, ఎడమ చేతిలో కోదండాన్ని ధరించి, కుడి చేత్తో భక్తులకు అభయాన్నిస్తున్న శ్రీరాముడు!

సినిమా హాలు గంట వినిపించింది. మ్యాటినీ వదల బోతున్నారు. ఉత్సాహంగా మరో బొమ్మను మొదలెట్టాడు చంద్రం.

గంగరాజుకు విసుగు కలిగింది. చంద్రాన్ని చూస్తుంటే చిరాకు కలుగుతూంది అతనికి. 'మూగ వెధవ — క్షణంలో జనం మూకను దగ్గిరికి లాక్కుంటాడు.'

జన సంచారం ఎక్కువైంది. దారినపోయే జనం శ్రీరాముడి చుట్టూ నిలబడుతున్నారు. గంగరాజు దృష్టి వచ్చేపోయే మనుషుల మీదికి ఎగుడు దిగుడుగా కదులు తూంది.

"ఇక్కడ నిలబడితే — ఇట్టా గుటకలు మింగుతూ కూర్చోవటమే మిగిలేది. ఒరేయ్, గంగూ, అట్టాపోదాం, రా."

గంగరాజు ఈ లోకంలోకి వచ్చేడు. తన పక్కగా వెంకడు. అతనికి వెనగ్గా ఖాన్, బలరామ్.

"ఏమిటోరా—ఇయ్యాల గిరాకీలు తగలటంలేదు." నీరసంగా అన్నాడు గంగరాజు.

"ఛ. అదేం మాటరా! పాసెంజర్లే కాడ కావెయ్యాలా? పద" అన్నాడు బలరామ్.

నలుగురూ కదిలేరు. రద్దీలోంచి తప్పుకుంటూ ముందుకు పోయేరు. అక్కణ్ణుంచి రోడ్డు సన్నబడిపోయింది. రోడ్డులాగానే వీధిదీపాలూ డీలాపడుతున్నాయి. చీకటిపడింది. వంతెనదాకా వచ్చేరు.

వంతెనమీద కూర్చున్నారు నలుగురూ. వంతెనకి మొదట్లో వీధిదీపం ఉంది. వంతెనకి వెనగ్గా బియ్యపుమిల్లు ఉంది. పనివాళ్ళ సమ్మెతో అదిప్పుడు మూతపడింది.

నలుగురి కళ్లూ తీక్షణంగా పరికిస్తున్నాయి. గంగరాజు మనసుమాత్రం టెర్లిన్ షర్టునే మననం చేసుకొంటూంది.

ఉన్నట్టుండి ఉత్సాహంగా కిందికి గెంతేడు ఖాన్, "గంగా! రెడీ!" అని, "పదండిరా, పోదాం" అంటూ వెంకడికీ, బలరామ్‌కీ సైగచేసేడు. గంగరాజు వంతెనదిగి నిక్కరుజేబులోకి కుడిచేతిని పోనిస్తూ దీపం కిందికి వచ్చేడు. మిగిలిన ముగ్గురూ దూరంగా తప్పుకున్నారు.

ఏదో ఆలోచించుకుంటూ, పరధ్యానంగా వస్తున్నాడో నడివయస్సు వ్యక్తి. గంగరాజు జేబులోనుంచి తన ఆయుధం తీసి, దీపం వెలుగులో కూర్చున్నాడు.

"రండి, రండి—పావలాకు అర్థా, అర్థకు రూపాయ్, రూపాయ్‌కు రెండు" అంటూ అరవసాగేడు. ఆ వ్యక్తి దృష్టి గంగరాజుమీదికి మళ్ళింది. గంగరాజు కళ్లు మెరిసేయి.

"రండి, రండి—రూపాయ్‌కి రెండు, రెండుకు నాల్గు" అంటూ చేతిలో ఉన్న నవారుని మడతలు పెట్టసాగేడు.

ఆ వ్యక్తి గంగరాజుకు సమీపంగా వచ్చేడు. అతనికి పక్కగా వచ్చి నిలబడ్డాడు బలరామ్. మరోవైపు చేరేడు ఖాన్.

"ఏమిటోయ్ అది? రూపాయికి రెండా? నిజంగా రెండు రూపాయలూ ఇచ్చేస్తావా?" అమాయకుడిలా అడిగేడు బలరామ్.

"అవును, చూడండి. ఇందులో నిజమైన మడత నవారుకు మధ్యగా ఒకటేకదూ ఉంది? దాన్ని ఈ పుల్లెట్టి కనుక్కోవాలి. కనుక్కుంటే, మీరు రూపాయ్‌కి రెండు సంపాదించవచ్చు."

"కనుక్కో లేకపోతే?" ఖాన్.

"రూపాయ్ నాకొస్తుంది."

"బాగుందే! ఏది, ఆ నవారు మడ తేది చూపించు" బలరామ్ అడిగేడు.

గంగరాజు నవారుని అయిదారు మడతలు వేసి క్రింద పెట్టేశాడు. తన చేతిలోని పుడకతో దాని మధ్యగా ఉన్న ఖాళీలో నొక్కి వుంచేడు. మరో చేత్తో నవారుకొస పట్టు

కుని లాగేడు. పుడక సరిగ్గా నవారుమధ్య మడతదగ్గిర నిలబడిఉంది.

“అరె, బలే తేలిక! ఇదో పెద్ద బెమ్మవిద్దెట్టా?” ఖాన్ అన్నాడు. అతను కిందికి వంగి కూర్చున్నాడు.

“అయితే చూసుకో....కాసుకో....” గంగరాజు మళ్లీ నవారుని మడతలు వేయసాగేడు.

“కాసుకుంటాగానీ—ఓమాటు ఉత్తినే ట్రయిలెయ్యి నిస్తావం?” అడిగేడు ఖాన్. “అట్టాగే....కానీ” గంగ రాజు పుడకని అతనిచేతి కిచ్చేడు.

ఖాన్ ఆలోచించి ఆలోచించి, పుడకని నవారు మధ్యగా నేలకేసి నిలబెట్టేడు. “నువ్వే తియ్” అన్నాడు గంగరాజు. ఖాన్ నవారుని లాగేడు. మధ్య మడతలోనే చిక్కుకుంది పుడక. “హాయ్....గెలిచా....” అరిచేడు ఖాన్.

“కూర్చోండి, గురూగారూ....చూద్దాం.” బలరామ్ ఆ వ్యక్తి భుజంమీద చెయ్యివేసి కూర్చోబెట్టాడు. మరి కొంతమంది జనం చుట్టూ చేరేరు. ఆ వ్యక్తి బల్రామ్ వైపు అదోలా చూస్తూ కూర్చున్నాడు.

“అయితే, నిజంగా డబ్బులిస్తావటోయ్?” బల రామ్ ప్రశ్న.

“గెలిస్తే—ఇస్తా....” గంగరాజు నిర్ధారణచేసేడు.

“ఇదిగో రూపాయ్ .... పెట్టు....” ఖాన్ జేబులో నుంచీ రూపాయనోటు తీసి గంగరాజు కిచ్చేడు. గంగరాజు

తన హస్తలాఘవం చూపేడు. ఖాన్ జాగ్రత్తగా ఆ మడ తల్ని గమనించి, పుడకని ఓచోట ఉంచేడు. ఆత్రంగా నవ్వారుని లాగేడు. పుడక మధ్యగా ఉంది, నవారుకు.

"గెలుపు మీది. ఇవిగో రెండు రూపాయలు" అంటూ రెండు రూపాయల కాగితాల్ని ఖాన్ కిచ్చేడు గంగరాజు. ఆనందాన్ని అభినయించేడు ఖాన్.

కొన్ని క్షణాలు తన పాట తాను పాడి, "మళ్లీ కాయండి....మీరు....మీరు" అంటూ అందర్నీ ఆహ్వానించేడు గంగరాజు. ఈసారి బలరామ్ ఓ అర్ధరూపాయి పందెం వేశాడు. అతనూ నెగ్గేడు. గంగరాజు రూపాయి ఇచ్చేడతనికి.

"ఏఁవిటండీ—ఇది" అంటూ జనాన్ని తప్పుకుంటూ ముందుకొచ్చి నిలబడ్డాడు వెంకడు. గంగరాజు పద్ధతీ, పథకం, పందెం నియమాలూ వల్లించేడు.

"అయితే, నా పందెం రెండు రూపాయలు" అంటూ కూర్చున్నాడు వెంకడు. అతనూ గెలిచేడు. అతనికి నాలుగు రూపాయలూ ఇచ్చేడు గంగరాజు.

"మీ పేరేమిటో గానీ, గురూగారూ? మీరూ ఓ చూపు చూడండి." బలరామ్ ఆ వ్యక్తిని పలకరించేడు.

'రాజారావ్ లెండి' అని 'ఎందుకండీ? నా కివన్నీ తెలీవు' అన్నాడతను.

'తెలిసే దేఁవుంది, రాజారావుగారూ? చూశారుగా....నాకు రూపాయ్ వచ్చింది' అన్నాడు ఖాన్.

'మీ కంత అనుమానంగావుంటే నే నాడిపెడతాను. మీ కేం భయంలేదు. ఏదీ ఒకరూపాయి ఇటివ్వండి.' భరోసా యిస్తూ చెయ్యి జాపేడు బలరామ్.

బిక్క చూపులు చూశాడు రాజారావ్. తన జేబును చేత్తో తడిమి చూసుకున్నాడు. గంగరాజు కేసి చూశాడు. అదోలా. నవారు కేసి అబ్బురంగా చూశాడు. పుడకని అపురూప వస్తువుని చూస్తు ఉన్నట్టు పరికించాడు. చివరికి గట్టిగా ఊపిరిపీల్చి వదిలేడు.

బనియను జేబులోని నోట్లకట్టని బయటకితీసి మధ్యగా ఉన్న రూపాయి కాగితాన్ని లాగి బలరామ్‌కిచ్చేడు. 'జాగ్రత్తండోయ్' అంటూ మిగిలిన సొమ్ము పై జేబులో పెట్టుకున్నాడు. గంరాజు కళ్ళు మెరిశాయి. ఖాన్ కళ్ళు చికిలించేడు!

రాజారావ్ బరిలోకి దిగేడు. రాజారావ్ బరిలోకి లాగబడ్డాడు!

బలరామ్ గెలిచాడు, మొదటి పందాన్ని. రాజారావ్‌కి కొండంత ధైర్యం వచ్చింది.

'ఈ సారి మీరే చూడండి.' అంటూ పక్కకి జరిగి కూర్చున్నాడు బలరామ్.

మళ్ళీ రూపాయే పందెం కాసేడు రాజారావ్. రూపాయి వచ్చింది. అతనికి తన తెలివి తేటల మీద నమ్మకం కుదిరింది. ఈ సారి రెండురూపాయల కాగితం బరిలో నిలిచింది. గంగరాజు నెగ్గేడు. దాన్ని జేబులో వుంచుకుటూ,

'అబ్బ....రూపాయొచ్చేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.' అని నిట్టూర్చేడు.

జనం నెమ్మదిగా జారుకోసాగేరు. రాజారావు మరో రెండు రూపాయలు పోగొట్టుకున్నాడు. ఇప్పుడతనికి పౌరుషం హెచ్చింది. పట్టుదల ఎక్కువైంది. జేబులోని నోట్లబొత్తిని బయటికితీసి అదోలా అందరి వైపు చూశాడు.

'ఏవిటండీ—అంత సందేహిస్తారు? పందెంపెంచండి. పోయినదానితో సహా తిరిగొస్తుంది.' వెంకడు ఉచిత సలహా ఇచ్చేడు.

క్షణంసేపు తటపటాయించి అంతలోనే ఒక నిర్ణయానికివచ్చి, అయిదు రూపాయలనోటు తీశాడు రాజారావ్. గంగరాజు తన చాకచక్యాన్ని ఉపయోగించి నవారుని మడిచి "కానీయం"డన్నాడు ధీమాగా. రాజారావ్ చేతివేళ్ళు చిత్ర విచిత్రంగా నృత్యం చేయసాగినాయి. వాటితో పాటు వేళ్ళు పట్టుకున్న పుడకా అటూఇటూ తచ్చాడసాగింది. చివరికి అది ఒకచోట ఆగింది.

కప్ప పోయి పోయి పాము నోట్లోనే పడుతుంది. పుడక దిగులుగా, భయం భయంగా, సందేహం సందేహంగా వణికి వణికి, తప్పుడు మడతనే కోరుకుంది.

వేళ్ళు గంగరాజునే ఆశ్రయించినాయి! మచ్చిక చేసుకోవటంలో అతను నేర్పరి మరి!

రాజారావ్ గుండెలు జారినాయి. కాని, చతుష్టయం, వాటినిపట్టి, పీకి, సరిఅయిన ప్రదేశంలో పెట్టి ధైర్యాన్ని

నూరిపోసింది. "మళ్ళీ ఆడి గెలవవచ్చు" అని హాస్యాన్ని మేళవించి, రాజారావ్‌లో ఆశని మేల్కొల్పింది.

ఫలితంగా రాజారావ్ జేబులో విశ్రాంతి తీసుకుంటున్న గాంధీ గారు గంగరాజు చేతుల్లో పడ్డారు. ఆ తరువాత రెచ్చిన రోషంతో, హెచ్చిన ఉక్రోషంతో పడవల్ని వది లేడు రాజారావ్. మూడు పడవలూ మునిగిపోయినాయి!

ఖాన్, బలరామ్, వెంకడూ జారుకున్నారు— రాజా రావ్ స్పృహలో కొచ్చేసరికి. ఖాళీ జేబులు రాజారావ్‌ని వెక్కిరించినాయి. అక్కడ మిగిలిన ఒకరిద్దరు పాసెంజర్లూ తన మొహంకేసి చూసి జాలిగా నవ్వుతున్నట్లనిపించిం దతనికి. హఠాత్తుగా కళ్లలో నీళ్లు తిరిగిగేయి.

"అంతా మోసం, దగా పచ్చి అన్యాయం" అ పిచ్చిగా అరిచేడు. సాధనాల్ని జేబులోకి జేరుస్తూ హేళనక్కి నవ్వేడు గంగరాజు.

రాజారావ్‌కి ఏడుపుముంచుకొచ్చింది. "నా డబ్బంతా దగాచేసి లాక్కున్నాడు. ఆస్పత్రిలో ఉన్న మా తమ్ముడి కివ్వాలని తీసుకొచ్చాను. తిరుగు ఛార్జీకికూడా మిగల్లేదు. పచ్చిమోసం. ఏంచిటి చెయ్యటం?" ఎవరితోనో చెపుతు న్నట్టు అన్నాడు రాజారావ్.

"మోసం, దగా అంటావేమిటయ్యా! ఆటలో ఓడి పోయావ్, పోగొట్టుకున్నావ్" అని పక్కకు తిరిగి అక్కడ నిలబడ్డ వాళ్ళతో — "ఏవండీ మీరంతా చూస్తూనే

ఉన్నారుగా, అతను గెలిచినప్పుడల్లా డబ్బిచ్చానా లేదా? అంతకుముందు వాళ్ళు నన్ను కానీ గెలవనీకపోతే నేనూ ఇలాగే యేడ్చానా? చెప్పండి. సార్" అన్నాడు

వాళ్ళంతా బుర్రలు తాటించారు అవునన్నట్లు. ఒకాయన అననే అన్నాడు: "నిజమేగదండీ. జూదం ఆడేరూ, ఓడిపోయారూ. దానికిప్పుడు ఏడ్చి లాభమేమిటి?'

రాజారావ్ వాళ్ళందరివైపూ 'అంతేనా' అన్నట్టు జాలిగా చూసేడు. పై పంచె తీసి నోరు నొక్కుకున్నాడు. గంగరాజుకేసి ప్రాధేయపూర్వకంగా చూసేడు.

"అందుకే ఇలాంటి వాటి జోలికి పోవద్దన్నారు.— మన పెద్దలు." మరో పెద్దయ్య గొడుగు తిప్పుకుంటూ సాగిపోయాడు.

చి॥ గులకరాళ్ళు డబ్బాలోపోసి కదిలించినట్టు నవ్వుతూంటూ ముందుకు కదిలేడు గంగరాజు. సాగిపోతున్న వాళ్లందర్నీ సజలాలైన కళ్లతో చూస్తూ ఉండిపోయాడు రాజారావ్.

రోడ్డు మలుపు తిరిగి దీపం వెలుతురులో నిలబడ్డాడు గంగరాజు. పై జేబులోనుంచీ నోట్లుతీసి, వాటిని సరిచేసి ఎంచుకున్నాడు. అతనికి ఎక్కడలేని తృప్తికలిగింది. నలభై నాలుగు రూపాయల ఆదాయం.!

అంతలోనే బిలబిలమంటూ వచ్చాడు వెంకడు. బలరామ్, ఖాన్, గంగరాజు వాళ్ళ ముగ్గురికీ తలా అయిదు రూపాయిలూ యిచ్చేడు. మిగిలిన డబ్బంతా మళ్ళీ లెక్కపెట్టి,

జేబులో దాచేడు. 'లాభంలేదు—ఇదిచాలను' అనుకున్నాడు.

"చాయ్ తాగుదాం రండి." ఖాన్ టీకొట్టువైపు దారితీశాడు. అంతా కదిలారు. "హాస్పటల్‌లో తమ్ముడికి ఇవ్వటాని కొచ్చాట్ట — బచ్చాగాడు." బలరామ్ పగల బడి నవ్వేడు. ముగ్గురూ శ్రుతికలిపేరు.

"ఈడెవడో మరీ మేకమెదడు బాపతుగ ఉందిరోయి.... వెంకడు జోకేశాడు. మళ్ళీనవ్వుకున్నారు అందరూను. "లేక పోతే, పడవలు పడవలు ఎవడు ముంచుకుంటాడంటా?" బలరాం

మిత్రులమాట వింటున్నాడన్నమాటేగాని, గంగరాజు మనస్సంతా నీలంరంగుమీద, ఎర్రగడీమీద తారట్లాడు తూంది.

టీదుకాణంలోకి వచ్చికూర్చున్నారు. నాలుగు టీలకి ఆర్డరిచ్చేడుఖాన్. "ఏం భాయి, ఇయాల గిరాకి బాగుందా యేం, ఫుల్‌చాయ్ లాగిస్తున్నావ్?" టీకొట్టు మురుగన్ అడిగేడు "అవును భాయ్." జవాబిచ్చాడు ఖాన్.

గంగరాజుదృష్టి మురుగన్ తొడుక్కున్న చాక్‌లెట్ కలర్ టెరిలిన్ షర్ట్‌మీద కేంద్రీకృతమైఉంది. 'ఇంకో కేస్ చూసి ఇయ్యాలే కొనిచ్చెయ్యాలి.' మనసులో తీర్మా నించుకున్నాడు.

ఉన్నట్టుండి వెంకడు అన్నాడు: "రేయ్ గంగూ, ఇదిగోరా రెండు రూపాయలూ—ఇందాక నే గెలిచినవి."

కాగితం గంగరాజుకు అందించి, "నేనియ్యాలింటికి పోవాలి. నన్నొదిలెట్టు" అని అడిగేడు. గంగరాజు డబ్బు తీసుకున్నాడు.

టీలు వచ్చినాయి. ఖాన్ రూపాయి కాగితం తీసి ఇచ్చాడు గంగరాజుకు. బలరామ్ అర్థరూపాయి నాణెం ఇచ్చేడు.

'ముప్పై రెండున్నర' అనుకుంటూ టీ తాగసాగేడు గంగరాజు.

టీ దుకాణం బయటికొస్తూనే అన్నాడు ఖాన్: "నేను పోతున్నారా, గంగూ, పనుంది."

"సరే అయితే, ఇయ్యాల్టికి ఆపేద్దాం." బలరామ్ తీర్మానించాడు. వాళ్ళు ముగ్గురూ వెళ్ళిపోయేరు.

మెయిన్ రోడ్డువైపు నడవసాగేడు గంగరాజు. ఉన్నట్టుండి అతని దృష్టికి దాసు కనిపించాడు. రోడ్డు పక్కగా మురుగు కాలవ ఒడ్డున కూర్చుని ఆట సాగిస్తున్నాడు దాసు. అతని వేళ్ళ ఆధారంగా మూడు పేకముక్కలు — ఎంతో సున్నితంగా వింతనాట్యాన్ని చేస్తున్నాయి. 'దాసుగాడికి వేళాపాళా లేదు' అనుకుంటూ సాగిపోయాడు గంగరాజు.

మెయిన్‌రోడ్డెక్కి రెండడుగులు వేసి పేవ్‌మెంటుమీద నిలబడ్డాడు గంగరాజు. ఎదురుగా పూల కొట్ల దగ్గర జడలు సిగలు అలంకరించుకుంటున్నాయి. వాటిపక్కనే ఉన్న ఫ్యాన్సీ కంగన్‌హాల్‌నిండా మెరుపుతీగలు. ఆ నాలుగు షాప్స్ అవతల క్లాత్ షాప్స్! గంగరాజు జేబుమీద చెయ్యి వేసుకు

న్నాడు. అడుగు ముందుకు వేయబోయి ఆగేడు. ‘ రాదేమో ఈ డబ్బుకి’ అనుకున్నాడు. నిరుత్సాహంగా పెదవి విరిచేడు. చూపులు మరల్చి తనకి వెనగ్గా చూసేడు. సత్తు గిన్నెలోని సేమ్యా పాయసాన్ని గరిటెతో కలుపుతూ “ గ్లాసు పది, గ్లాసు పది ” అని అరుస్తున్నాడు గడ్డాల ముసలాయన. ఆయన పక్కగా ఓ పదేళ్ళ కుర్రాడున్నాడు. వాడు పెద్ద పళ్ళెం నిండా చేగోడీలు పెట్టుకుని, “అయిదు–పది ” అంటూ ముసలాయనతో పోటీ పడుతున్నాడు అరవటంలో. వీళ్ళిద్దరికీ కొంచెం అవతలగా ఓ ముసిల్ది పెంకు ముక్కతో కుంపటి చేసుకుని మొక్కజొన్న పొత్తులు కాలుస్తూంది. వాళ్ల ముందు వస్తున్నాడొకతను. అతని ఒంటి నిండా–పట్టు దారాలూ, బెడ్ లైటు వత్తులూ, పిన్నీసులూ, రిబ్బన్లూ వేలాడుతున్నాయి. చేతిలో పండ్లపొడి పొట్లాలున్నాయి. వీటన్నిటి దండకమూ వల్లిస్తూ చాలా గంభీరంగా నడచి వస్తున్నాడు.

వీళ్ళందర్నీ చూస్తుంటే గంగరాజుకో అనుమానం వచ్చింది– ‘ఈ బేరాలమీద ఎంతలాభ మొస్తుంది. దానితో వీళ్ళెట్లా బతుకుతున్నారూ’ అని, వెంటనే నవ్వొచ్చింది. తెలివితక్కువ దద్దమ్మలు....బతకటం తెలీని మనుసులు’ అనుకున్నాడు.

ఆలోచనని ఆపి నడక సాగించేడు. రెండడుగులు వేయగానే ఠకీమని కొట్టుకున్నాడు, ఎదురుగా వస్తున్న వ్యక్తిని. “ ఏం కళ్ళు నెత్తిమీద పెట్టుకుని నడుస్తున్నావ్ ” అంటూ

"అతన్ని చూసేడు గంగరాజు. వాడు సింహాద్రి. ఎడమ భుజానఉన్న జోలిని కుడివైపు మార్చుకుంటూ, "ఒరేయ్, గంగూ, నువ్వా!" అని పలకరించేడు. అతను చాలా హుషారుగా ఉన్నట్టు కనిపించేడు.

"బేరాలెలా ఉన్నాయిరా...." అడిగేడు గంగరాజు సింహాద్రి భుజానికిఉన్న జోలెకేసి చూస్తూ. "పర్లేదు...." అంటూ సాగిపోయేడు సింహాద్రి.

చిల్లర వెధవ. ఆ గోలీల జూదమంతా పైసలతో సరి." ఎవరితోనో చెపుతున్నట్టు అన్నాడు. క్షణంసేపు సింహాద్రికేసి అదోలా చూసి కదిలేడు గంగరాజు.

గంగరాజు పార్కుదాకా నడిచేడు. అక్కడ రోడ్డు చాలనిశాలంగావుంది. పార్కుకి ఆనుకుని పారుతున్న మురికి కాలువగట్టున చాలా బడ్డీకొట్లున్నాయి. వాటిలో అనేక రకాల వ్యాపారాలు సాగుతూఉంటాయి.

"గంగూ...." పిలుపు వినిపించింది. గంగరాజు ఆ వైపు చూసేడు. చంద్రంగాడు కేకేశాడు. గంగరాజు చంద్రం బడ్డీ కొట్టు దగ్గర కొచ్చేడు. కొట్లో యిద్దరు మనుషులు కూర్చుని అట్టలూ పుస్తకాలూ పరీక్షిస్తున్నారు. వాటినిండా అంకెలు! గంగరాజుకు పక్కగా బెంచిమీద ఓ కుర్రాడున్నాడు. వాడు తన చేతిలో నున్న పుస్తకాన్ని చాలా ఆత్రంగా, ఆసక్తిగా చదివేస్తున్నాడు. ఆ పుస్తకం అట్టమీద–సినిమా తారలబోలిన స్త్రీ యౌవ్వనం, ఆమె లోనెక్ జాకెట్లోనుంచి జారిపోతోంది.

"ఇయ్యాల నీనెంబరెంతరా, గంగూ? ఓరూపాయికి రాస్తా-- చెప్పు" చంద్రంచేతిలో చిన్నపుస్తకం పెన్సిలు ఉన్నాయి.

"ఇయ్యాలేం వద్దశా" విసుగ్గా అన్నాడు గంగరాజు. నివ్వెరపోయి అతనిముఖంలోకి చూసేడుచంద్రం. ఇంతిలో ఓయువకుడు గంగరాజుని రాసుకుంటూ కొట్టుదగ్గరకు వచ్చాడు. గంగరాజు అతనికేసి తేరిపార చూశాడు. ఖరీదైన దుస్తుల్లో, కళ్ళజోడుతో, గిరజాలజుట్టుతో, కాళ్ళకున్న బూట్లుతో మెరిసిపోతున్నాడు. గంగరాజు అతనిపర్సుని పరీక్షగాచూసేడు. 'చాలా చాలా బాగుందది.'

"ఏవన్నా వచ్చినయ్యా?" చంద్రంని అడిగేడతను. "వచ్చినాయి, సార్" అంటు ఎంతో వినయంగా, గౌరవంగా చిన్న కవరొకటి తీసి అతనికి అందించాడు చంద్రం. అతను దాన్ని చూసి కొండంత సంబరపడిపోయాడు. కవర్లోంచిఒక్కొక్క ఫొటోనేతీసి చూడటం మొదలెట్టాడు. అవన్ని నగ్నచిత్రాలు! గంగరాజు అతనిచొక్కా అంచుల్ని వేళ్ళతో పట్టుకుని చూశాడు. గొంతుసరిచేసుకుని "ఎంతయింది, సార్, ఇది?" అంటూ ప్రశ్నించాడు. అతను కంగారుపడ్డాడు. గబుక్కున ఫోటోల్ని దాచేస్తూ, "ఏది, ఏది?" అని ఎదురుప్రశ్న వేశాడు.

గంగరాజు సన్నగానవ్వుతు, "మీపర్సుఅండి" అన్నాడు అతను తేలికగా ఊపిరిపీల్చుకుని, "నలభైఆరు రూపాయలు" అని సమాధానమిచ్చేడు. 'అబ్బో' అనుకున్నాడుగంగరాజు. అతనుమరికొంచెంసేపు ఆ ఫోటోల్నిచూసి, కవరు చంద్రానికి ఇచ్చేసి, "పదిపైసలు రాసుకో పద్దులో" అంటూ వెళ్ళాడు.

గంగరాజు అతనిపట్టువైపు చూస్తు ఏదో ఆలోచనలో పడిపోయాడు.

"గంగూ .... గంగూ !" ఆత్రంగా పిలిచినపిలుపుకి తెప్పరిల్లుకున్నాడు గంగరాజు. పిలుపు వినిపించిన దెశగా చూశేడు.

రోడ్డుకు అవతలి వైపుగా రిక్షాలు అగి ఉన్న చోట నిలబడి ఉన్నాడు గోపాలం. 'రాగోరేయి, గంగూ, ఓసారిలు రారోయ్ !' చేతులు ఊపుతు పొలికేకలు పెడుతున్నాడు.

గంగరాజు గబగబా నడచి గోపాలం దగ్గరకువచ్చాడు

గోపాలం ఒక్కసారిగా బావురుమన్నాడు

గంగరాజు ఆశ్చర్యపోతు, "ఏఁవైందిరా, ఏఁవిటి" అనిఅడిగేడు. వాడు కళ్ళునులుముకుంటు మొదలెట్టాడు; "మాయింట్లో అందరికి నిన్నటాలనుంచి కూడులేదు. మా అయ్యేటో సచ్చిండు. మాఅమ్మ ఇయ్యాల ప్రొద్దుట్నించి కూలిసేసింది. ఇంటికాడకొచ్చి నాకో రూపాయిచ్చింది—నూకల్ని తెమ్మని."

"దీనికి ఏడుపు ఎందుకురా?" దిక్కుల్ని చూస్తు తేలికగా అన్నాడు గంగరాజు.

"అదికాదురా, ఆరూపాయి కాత్తా...." నసిగేడు గోపాలం, ఏడుపు కొంచెం కొంచెం దిగమింగుకుంటూ.

"ఆఁఏవైంది ?"

"అదుగో, ఆడు కొట్టేసిండు" చేత్తో పక్కరిక్షాలో కూర్చుని బీడి వెలిగించుకొంటున్న రిక్షావాడ్ని చూపాడు గోపాలం.

గంగరాజు ఒక్క ఉదుటున అక్కడికి వెళ్ళాడు. “ఏరా, ఈడిరూపాయి కొట్టేశావంట ?” గోపాలం వాడికేసి క్రోధంగా చూస్తూ నిలబడ్డాడు.

గంగరాజు మరోసారి గద్దించేడు: “ఏరా, మాట్లాడవేం ?”

పో....మెశా....పెద్ద పోటుగాడిలా వచ్చావు. ఆడోడి పోయిండు. నాకొచ్చింది” తాపీగా బీడిపొగ వదుల్తు చెప్పేడు.

“అంతా మోసం, దగా....” గోపాలం పళ్ళు నూరాడు.

“మోసమేందిరా, గుంటడా ? పావలాకి అర్ధరూపాయిని నూక్కుపోదామనుకున్నావ్. ఓడిపోయావ్. మొత్తం రూపాయి నే గెల్చుకున్నాను.

“అదేంకాదురా, గంగూ ! పావలా కాసు చేత్తో పట్టుకుని దానిమీదున్న సంవత్సరం రైటుగా చెపితే పావలాకి అర్ధరూపా యిస్తానన్నాడు. సరేనని చెబితే....” ఆగి, నూకల డబ్బుకాత్తా పోయింది. మాఅమ్మ చంపేత్తాది. మా తమ్ముళ్ళు, చెల్లమ్మ ఎదురు చూస్తుంటారు. సచ్చినాడు అన్యాయంగా రూపాయి నూకిండు....” అని ఏడుస్తూ తిట్లు మొదలుపెట్టాడు గోపాలం.

గంగరాజుకు కోపం ముంచుకొచ్చింది. “ఏందిరా, ఆడుసెప్పేది నిజమేనా ? రిక్షావాడి చొక్కా పట్టుకుని గద్దించాడు. వాడునోట్లోబీడీ తీసి అవతల పారేసి, “చొక్కా వదులుముందు.... ఏం నిజవైతే ఏం చేత్తావేం ? అన్నాడు.

" ఏంసేస్తానా, దొంగముం........ క. కక్కు, ఆడి రూపాయి ఆడికి కక్కు అంటు ఒక్క దెబ్బ కొట్టేడు గంగ రాజు పిడికిలి బిగించి

" కొడతావురా.... నన్నే కొడతావురా .... నీఅంతు తేలుస్తానుండు" తుండు తలకుచుట్టి, చొక్కా చేతులుమడచి సాచి చెంపకేసి కొట్టాడు గంగరాజుని.

గంగరాజు కళ్ళు బైర్లుకమ్మాయి. క్షణంలో తెప్ప రిల్లుకొని పళ్ళునూరేడు. పిడికిలిబిగించి, పెదవులుబిగపట్టి వాడిమీదికి దూకేడు. 'తి త్తితీస్తానురోయ్.... తి త్తితీస్తాను. అన్నాయంగా ఆడికాడ రూపాయికొట్టేసింది గాక, నా మీదకొత్తావురా....

ఇద్దరూ కలబడ్డారు.

గోపాలం వెక్కులు పెడుతూ రిక్షావాణ్ని శాపనార్ధా లను పెడుతున్నాడు.

చుట్టూజనంమూగేరు.

ఎవరో ఇద్దర్నీ విడదీయటానికి ప్రయత్నించేరు. కానీ ఇద్దరూ లొంగలేదు. ఇంకొక అతనెవరో కల్పించుకుని, ఇద్దర్నీ చెరొక వైపు తోసిపారేశాడు.

గంగరాజు ఇసకదిబ్బలో పడ్డాడు. రిక్షా అతన్ని మరొక రెవరో అవతలకి లాక్కుపోయేరు. జనమూ తప్పు కున్నారు.

" రేయ్ నీ రక్తం కళ్ళజూత్తాను సూడు...." అంటూ లేచేడు గంగరాజు. గోపాలం అతనిదగ్గరగా వచ్చేడు, కళ్లు తుడుచుకుంటూ.

గీరుకుపోయిన మోకాళ్ళను తుడుచుకుంటూ, కిందికి వంగేడు గంగరాజు. అతని జేబులోనుంచి నోట్లు, చిల్లరా క్రిందపడినాయి.

"అరె....రె....డబ్బు...." అంటూ వాటిదగ్గరగా కూలబడి ఏరసాగేడు గోపాలం. గంగరాజు పరధ్యానంగా, మెత్తటి ఇసుకని మోకాలుమీద గీరుకుపోయిన చోట అద్దుకుంటున్నాడు.

"గంగూ....పొద్దున్న డబ్బులడిగితే లేవంటివి గదరా, ఇప్పుడు ఇన్ని డబ్బులెక్కడివిరా....ఏరా, గంగూ ?"

గంగరాజు కళవళపడిపోయాడు. తలఎత్తి గోపాలం వైపు చూసేడు. గోపాలం చూపులు గంగరాజు కళ్ళలో గుచ్చుకున్నాయి. "యింత డబ్బెట్టా సంపాదించావురా, గంగూ ?" మళ్ళీ అడిగేడు గోపాలం.

"ఊఁ....ఆఁ...." తో తడబడ్డాడుగంగరాజు. "ఎట్టా సంపాయిత్తేంగానీ...." అంటూ తల వంచుకుని పక్కకి కదిలేడు. అతని చేతులు అప్రయత్నంగా నిక్కరు జేబు మీదికిపోయినాయి. అతని కళ్ళలో గోపాలం తల్లిరూపం లీలగా కదిలింది; ఆమె సంసారమూ ప్రత్యక్షమైంది. *